క్లుప్తంగా

నేడు సచివాలయ కన్వీనర్లతో సమీక్ష

నగరి : పట్టణ పరిధిలోని ఏజేఎస్ కల్యాణ మండపంలో సోమవారం ఉదయం 10 గంటలకు నియోజకవర్గంలోని మండల, మున్సిపల్ సచివాలయ కన్వీనర్ల సమావేశం జరగనుంది. ఈ సమావేశంలో రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక వ్యవహారాల, యువజన సర్వీసుల, క్రీడా శాఖ మంత్రి ఆర్కే రోజా పాల్గొంటారు. సమావేశానికి సచివాలయ కన్వీనర్లు, ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు హాజరు కావాలని మంత్రి సోదరుడు రామ్‌ప్రసాద్ రెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు.

అలరించిన భీష్మ ప్రతిజ్ఞ ఘట్టం


హరికథా గానం చేస్తున్న భాగవతారిణి సుమతి

పుత్తూరు రూరల్: స్థానిక ధర్మరాజుల స్వామి ఆలయ ఆవరణలో భాగవతారిణి ఎస్.సుమతిచే నిర్వహిస్తున్న మహాభారత హరికథా గానం శ్రోతలను అలరిస్తోంది. శ్రీద్రౌపదీ సమేత శ్రీధర్మరాజులస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మహాభారత హరికథా కార్యక్రమం గత నాలుగు రోజులుగా జరుగుతున్న విషయం విదితమే. రోజుకో పర్వం చొప్పున 18 రోజుల పాటు ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఆదివారం భీష్మ ప్రతిజ్ఞ ఘట్టాన్ని శ్రోతలకు కళ్లకు కట్టినట్లు భాగవతారిణి హరికథా గానం చేశారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ చైర్మన్ బీఎస్ మోహన్ పర్యవేక్షిస్తున్నారు.

నడక మార్గంలో భక్తుల రక్షణపై దృష్టి సారించాలి

తిరుపతి కల్చరల్: తిరుమలకు వెళ్లే నడక మార్గాల్లో భక్తుల రక్షణకు టీటీడీ దృష్టి సారించాలని అఖిలపక్ష నేతలు డిమాండ్ చేశారు. యశోదానగర్‌లోని ఎంబీ భవన్‌లో సీపీఎం నగర కార్యదర్శి ఆధ్వర్యంలో ఆదివారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, జనసేన నేత ముని శంకర, ఆమ్ ఆద్మీ పార్టీ నేత నగేష్, సీపీఐ నేత శివ, డీఎంసీ భాస్కర్ పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ తిరుమలకు వెళ్లే నడక మార్గాల్లో కంచె నిర్మించాలన్నారు. నాలుగైదు చోట్ల నడక మార్గం కింద అండర్ ప్రాసెస్ వంటి నిర్మాణాలు చేపడితే వన్యప్రాణులు రాకపోకలకు అంతరాయం ఉండదని తెలిపారు. లక్షిత కుటుంబానికి రూ.50 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వడంతో పాటు వారి కుటుంబంలో ఒకరికి టీటీడీ ఉద్యోగం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల: శ్రీవారిని ఆదివారం ఎంపీ మాగుంట శ్రీనివాస్ రెడ్డి, కేంద్ర సహాయ శాఖ మంత్రి ఎల్.మురుగన్, రాష్ట్ర మంత్రి నారాయణ స్వామి, ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి, ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుజాత, ఏపీ టూరిజం చైర్మన్ వరప్రసాద్ రెడ్డి దర్శించుకున్నారు. వారికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనం అందించగా అధికారులు లడ్డు ప్రసాదాలతో సత్కరించారు.

సంస్కృత వర్సిటీలో హర్ ఘర్ కా తిరంగ్


త్రివర్ణ పతాకాన్ని ఎగురవేస్తున్న ఎన్ఎస్ఎస్ అధికారులు, వలంటీర్లు

తిరుపతి సిటీ: ఆజాదీకా అమృత్ మహోత్సవంలో భాగంగా ఆగస్టు 15ను పురస్కరించుకుని ఆదివారం స్థానిక జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో ఎన్ఎస్ఎస్ యూనిట్–4 ఆధ్వర్యంలో హర్ ఘర్‌కా తిరంగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రోగ్రామ్ ఆఫీసర్ వి.సేతురాం వలంటీర్స్‌తో కలిసి విశ్వవిద్యాలయంలోని ప్రతి భవనంపైనా త్రివర్ణ పతాకం ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ చందూలాల్, అసిస్టెంట్ ఇంజినీర్ భరణి, రవి పాల్గొన్నారు.

వీనుల విందుగా గాత్ర కచేరి


సంకీర్తనలు గానం చేస్తున్న కళాకారిణి ప్రణతి

తిరుపతి కల్చరల్: టీటీడీ రామ్‌నగర్ క్వార్టర్స్‌లోని గీతామందిరంలో నిర్వహిస్తున్న తిరుపతికి చెందిన సాంస్కృతిక సంస్థ రాగ రసజ్ఞ సంగీతోత్సవాలు ఆదివారం ముగిశాయి. ఇందులో భాగంగా హైదరాబాద్‌కు చెందిన వైజర్స్ ప్రణతి చేసిన గాత్ర కచేరి ఆహూతులకు వీనుల విందు చేసింది. కాంభోజి రాగం, రూపక తాళంలో త్యాగరాజ కృతి ఏలరా కృష్ణా సంకీర్తనను గానం చేసి అలరించారు. వయోలిన్‌పై వాసుశాస్త్రి, మృదంగంపై కార్తికేయ ఆది నారాయణ శర్మ సహకారం అందించారు. ఈ సందర్భంగా కళాకారిణి ప్రణతి, కళాకారులను సాంస్కృతిక సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు హెచ్ఎస్.వెంకటేష్, కె.రామ్‌కుమార్ ఘనంగా సత్కరించారు.

తలుపు తట్టి.. నాడిపట్టి..

విద్య, వైద్యరంగాలకు అతిపెద్ద ప్రాధాన్యం ఇస్తున్నారు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా పని చేసిన వైఎస్ రాజశేఖర రెడ్డి ఆరోగ్యశ్రీ, 108 వంటివి ప్రవేశపెట్టి ప్రజల పాలిట ఆరోగ్యప్రదాతగా కీర్తి ఘడించారు. అయితే ఆయన తనయుడు, ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఏకంగా పేదవాడి ఇంటి వద్దకే ప్రభుత్వ వైద్యసేవలు అందాలన్న సదుద్దేశంతో ప్రతిష్ఠాత్మకంగా ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారు. తద్వారా ప్రాథమిక దశలోనే వ్యాధులను గుర్తించి సకాలంలో చికిత్స అందిస్తున్న ఈ ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం సత్ఫలితాలను ఇస్తోంది.


పాఠశాలలో విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

- పేదవాడి గడప వద్దకే ప్రభుత్వ వైద్యం
- సత్ఫలితాలు ఇస్తున్న ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం
- 104 వాహనం ద్వారా నెలలో ప్రతి గ్రామంలో రెండుసార్లు వైద్యసేవలు
- ఉచితంగా 14 రకాల పరీక్షలు, 67 రకాల మందులు అందజేత
- 4 వేల రోగాలకు ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా వైద్యం
- ఆనందం వ్యక్తం చేస్తున్న ప్రజలు

శ్రీరంగరాజపురం: ప్రభుత్వ వైద్యం పేదవాడి ఇంటి తలుపు తడుతోంది. ఎలాంటి అత్యవసర పరిస్థితుల్లో అయినా ప్రభుత్వ వైద్యం అందాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం పకడ్బందీగా అమలవుతోంది. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల


గ్రామాల్లో వైద్యం అందిస్తున్న డాక్టర్ పల్లవి

కోసం రాజీ లేని నిర్ణయాలు తీసుకుంటున్నారు. ప్రభుత్వ ఆస్పత్రులను నాడు-నేడు ద్వారా కార్పొరేట్ ఆస్పత్రులకు ధీటుగా మార్చేశారు. అలాగే దాదాపు 4 వేల వ్యాధులను ఆరోగ్యశ్రీ పరిధిలోకి తీసుకొచ్చి, మన రాష్ట్రంతో పాటు పొరుగు రాష్ట్రాలైన తమిళనాడు, తెలంగాణ, కర్ణాటక తదితర ప్రాంతాల్లో సైతం ఆరోగ్యశ్రీ ద్వారా వైద్యం పొందేలా చర్యలు చేపట్టారు.

రెండు 50 పడకల ఆస్పత్రుల మంజూరు

గంగాధరనెల్లూరు నియోజకవర్గ పరిధిలో కార్వేటినగరం, పెనుమూరు పీహెచ్‌సీలను డిప్యూటీ సీఎం నారాయణస్వామి చొరవతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో 50 పడకలు ఆస్పత్రులుగా మార్చారు. 24 గంటల పాటు డాక్టర్‌తో పాటు వైద్యసిబ్బంది అందుబాటులో ఉండే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అలాగే ప్రతి పీహెచ్‌సీలో ఇద్దరు వైద్యులు, సిబ్బంది, ఆరోగ్య పరీక్ష కేంద్రాలు అందుబాటులో ఉండేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ప్రతి మండలంలో రెండు 104 వాహనాల ద్వారా వైద్యసేవలు అందిస్తున్నారు. ఇందులో 14 రక్త పరీక్షలతో పాటు వివిధ ప్రాథమిక వైద్య పరీక్షలు, 67 రకాల మందులను అందిస్తున్నారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల ఆరోగ్యంతో పాటు మండల, జిల్లా పరిషత్ పాఠశాలల్లోని విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, వారికి ఐరన్ లోపం తలెత్తకుండా మందులు అందించి, ఆరోగ్య సూచనలు చేస్తున్నారు. అలాగే 104 వాహనంలో మెడికల్ ల్యాబ్‌లో 14 రకాల పరీక్షలు చేస్తున్నారు.

ఆరోగ్యశ్రీ సేవలు అభినందనీయం



నేను ఆరోగ్యశ్రీ ద్వారా గర్భసంచి శస్త్రచికిత్స చేసుకున్నా. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం పేద, మధ్య తరగతి కుటుంబాలకు ఎంతో ఉపయోగపడుతోంది. నెలకు రెండుసార్లు మా గ్రామానికి 104 వాహనం వచ్చి డాక్టర్లు వైద్య పరీక్షలు చేస్తున్నారు. బీపీ, షుగర్‌తో బాధ పడుతున్న వారికి మందులు ఉచితంగా అందిస్తున్నారు. రూపాయి ఖర్చు లేకుండా, దూరాభారం వెళ్లకుండా మా ఊర్లోనే మంచి వైద్యం అందిస్తున్నారు.

– ఎం.హేమవతి (పాతపాల్యం)

జగనయ్యా చల్లగా ఉండాలి..



నాకు కాళ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. గతంలో చికిత్స కోసం వ్యయప్రయాసలు పడి జిల్లా ఆస్పత్రికి వెళ్లి మందులు తెచ్చుకునేవాళ్లం. ఇప్పుడు నా మనవడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టి, మా ఇంటి వద్దకే డాక్టర్ వచ్చి పరీక్షలు చేసి, ఉచితంగా మందులు అందేలా చేశాడు. నాకు చాలా ఆనందంగా ఉందయ్యా.. నా ఆయుష్షు కూడా పోసుకుని జగనయ్య చల్లగా ఉండాలి.

– టి.చిలకమ్మ, పెద్దతయ్యూరు

పకడ్బందీగా అమలు



ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం పకడ్బందీగా అమలువుతోంది. నెలలో మండలంలోని 23 పంచాయతీలను సందర్శించి, 104 వాహనం ద్వారా వైద్యులు సేవలందిస్తున్నారు. గ్రామీణ ప్రజలు ఆరోగ్య సంరక్షణే ధ్యేయంగా ప్రభుత్వం పల్లెకు వైద్యాన్ని తీసుకొచ్చింది. డాక్టర్లు రోగులు ఇంటి వద్దకే వెళ్లి సేవలు చేస్తున్నారు. ఈ కార్యక్రమం విజయవంతమవుతోంది.

– బాలసుబ్రమణ్యంరెడ్డి, పీహెచ్‌సీ వైద్యులు, ఎస్ఆర్ పురం

భక్తిప్రపత్తులతో ప్రదోష పూజలు

పిచ్చాటూరు: మండలంలోని సిద్ధిరాజుకండ్రిగ శ్రీ గౌరీ సమేత సోమనాథేశ్వర ఆలయంలో ఆదివారం భక్తిప్రపత్తులతో మహా ప్రదోష పూజలు చేశారు. ఆలయంలో శ్రీ సోమనాథేశ్వరుని అభిముఖంగా ఉన్న నందీశ్వరునికి అర్చకులు పంచామృతాలతో అభిషేకించి, పలు రకాల పుష్పాలతో విశేష అలంకరణ చేశారు. అనంతరం మహా హారతి సమర్పించారు. శివపార్వతుల ఉత్సవమూర్తుల ప్రాకారోత్సవం నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు వితరణ చేశారు. ఏర్పాట్లను ఆలయ ధర్మకర్త జ్యోతిరాజు పర్యవేక్షించారు.


సిద్ధిరాజుకండ్రిగ శ్రీ సోమనాథేశ్వరాలయంలో నందీశ్వరునికి హారతి ఇస్తున్న అర్చకులు

గంగమ్మ సారె ఊరేగింపు

నారాయణవనం: స్థానిక పురవీధుల్లో ఆదివారం గంగమ్మ సారెను ఊరేగించారు. బుధవారం బలిజ సంఘం నిర్వహించే గంగమ్మల జాతర సందర్భంగా సాంఘిక సంక్షేమ వసతి గృహం సమీపంలోని రజక కాలనీ నుంచి ఆదివారం ఉదయం ప్రతిమను తయారు చేసే పసుపు, కుంకుమలకు ప్రత్యేక పూజలను నిర్వహించారు.


గంగమ్మకు సారెను ఊరేగింపుగా తీసుకొస్తున్న గ్రామస్తులు

సోమవారం సాయంత్రం వరకు వీధుల్లో ఊరేగిన పసుపు, కుంకుమలతో గంగమ్మ ప్రతిమను రజక కాలనీలో రూపుదిద్ది మంగళవారం రాత్రి సర్వ భూపాల వాహనంలో ఊరేగిస్తామని నిర్వాహకులు శరత్‌కుమార్, చలపతి తెలిపారు. బుధవారం రాత్రి అమ్మవారి నిమజ్జనం నిర్వహించి, భక్తులకు పసుపు, కుంకును పంపిణీ చేస్తామన్నారు.

ప్రైవేట్ హాస్టల్‌లో చోరీ

పుత్తూరు రూరల్: స్థానిక నగరం రోడ్డులోని ఓ ప్రైవేట్ హాస్టల్‌లో ఆదివారం ఉదయం చోరీ జరిగినట్లు సీఐ లక్ష్మీనారాయణ తెలిపారు. సంఘటనపై ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రైవేట్ హాస్టల్‌లోని ఓ గదిలో ఉన్న 4 సెల్‌ఫోన్లు, 2 ల్యాప్ ట్యాప్‌లు చోరీ అయినట్లు చెప్పారు. వీటి విలువ సుమారు రూ.75 వేలు విలువ ఉంటుందన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

శాస్త్రోక్తంగా ధ్వజావరోహణం



శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా విజ్ఞానగిరిపై వెలసిన శ్రీవల్లీదేవసేన సమేత కుమారస్వామి ఆడికృత్తిక ఉత్సవాలను పురస్కరించుకుని ఆదివారం శాస్త్రోక్తంగా ధ్వజావరోహణం నిర్వహించారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలోని చెంగల్వరాయస్వామి సన్నిధి వద్ద ధ్వజావరోహణ పూజలు నిర్వహించారు. దీంతో ఆడికృత్తిక ఉత్సవాలు ముగిశాయి. ఈ కార్యక్రమంలో ఆలయ పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, సభ్యులు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న దుర్యోధన వధ


అగ్నిగుండ ప్రవేశం చేస్తున్న భక్తులు

కార్వేటినగరం: మండలంలోని కత్తెరపల్లిలో వెలసిన శ్రీద్రౌపదీ, ధర్మరాజులస్వామి వారి ఆలయంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం నిర్వహించిన దుర్యోధన వధ ఘట్టం ఆహుతులను ఆకట్టుకుంది. ఉదయం ఆలయ అర్చకులు స్వామి, అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు చేపట్టి భక్తులను దర్శనానికి అనుమతించారు. మధ్యాహ్నం భాగవతారిణి నాగరత్న హరికథా కాలక్షేపం చేశారు. మధ్యాహ్నం శ్రీకృష్ణార్జున నాట్య కళామండలి ఆధ్వర్యంలో దుర్యోధన వధ ఘట్టాన్ని ప్రదర్శించారు. దుర్యోధనున్ని గంగ మడుగు నుంచి భీమసేనుడు తీసుకొచ్చే ఘట్టం చూపరులను విశేషంగా ఆకట్టుకుంది. దుర్యోధన పాత్రదారుడు ఆలపించిన పద్యాలు పలువురిని కంటతడి పెట్టించాయి. ఈ సన్నివేశాన్ని తిలకించడానికి చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో భారతంమిట్ట జనసంద్రంగా మారింది.


దుర్యోధన వధ ఘట్టాన్ని ప్రదర్శిస్తున్న కళాకారులు

భక్తిశ్రద్ధలతో అగ్నిగుండ ప్రవేశం

వార్షిక మహాభారత బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి అగ్నిగుండ ప్రవేశం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. కంకణాలు ధరించిన భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పసుపు వస్త్రాలు ధరించి, వేపాకులు చేతపట్టి అమ్మవారి విగ్రహంతో పాటు గోవిందనామాలను స్మరిస్తూ అగ్నిగుండ ప్రవేశం చేశారు. మొక్కులు ఉన్న మహిళా భక్తులు అగ్నిగుండం చుట్టూ ప్రదర్శనలు చేసి అమ్మవారి ఆలయంలో మొక్కులు చెల్లించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు, ధనగిరిరెడ్డి, బాబురెడ్డి, కృష్ణారెడ్డి, పద్మనాభరెడ్డి, రాజగోపాల్ రెడ్డి, నాదమునిరెడ్డి, కుప్పయ్య, కత్తెరపల్లి గ్రామస్తులు, పరిసర గ్రామస్తుల ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు.

ద్రౌపదీదేవిని దర్శించుకున్న డిప్యూటీ సీఎం

కత్తెరపల్లి గ్రామంలో జరుగుతున్న శ్రీద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామి మహాభారత వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం అగ్నిగుండ ప్రవేశాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి అమ్మవారిని దర్శించుకున్నారు. అర్చకులు ఆయనకు స్వామి, అమ్మవారి తీర్థ ప్రసాదాలను అందించి ఆశీర్వచనలు అందించారు. అనంతరం ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి ఆలయ ధర్మకర్తలు ధనగిరి రెడ్డి, బాబురెడ్డికి శాలువ కప్పి ఘనంగా సన్మానించారు. అలాగే విశ్రాంత తుడా ప్లానింగ్ అధికారి కృష్ణారెడ్డి, వైస్ ఎంపీపీ కార్తిక్‌రెడ్డి , ఉప సర్పంచ్ కుప్పయ్య, పలువురు గ్రామంలోని నాయకులు డిప్యూటీ సీఎం నారాయణస్వామిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ గ్రామాల్లో భక్తి భావాలతో పాటు స్నేహాన్ని పెంపొందించడానికి గ్రామోత్సవాలు ఎంతో దోహదపడుతాయన్నారు. ఆయన వెంట జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ, మండల కన్వీనర్ శేఖర్‌రాజు, రాష్ట్ర యువత ప్రధాన కార్యదర్శి ధనంజయ రెడ్డి, మేజర్ పంచాయతీ సర్పంచ్ ధనుజయవర్మ, కోఆప్షన్ మెంబర్ పట్నం ప్రభాకర్‌రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు లోకనాథరెడ్డి, పలువురు నాయకులు పాల్గొన్నారు.


ద్రౌపదీదేవీ అమ్మవారి సేవలో ఉప ముఖ్యమంత్రి నారాయణ స్వామి

చలపలమ్మ ఆలయంలో ఆడిపూజలు


చలపలమ్మ ఆలయం వద్ద ట్రస్టు సభ్యులు, గ్రామ ప్రజలు

నగరి : తడుకుపేట శివారులో ఉన్న శ్రీచలపలమ్మ ఆలయంలో ట్రస్టు సభ్యులు ఆదివారం ఆడిపూజలు వైభవంగా నిర్వహించారు. ట్రస్టు ఆధ్వర్యంలో ఏటా ఆడి నెల పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమాలు నిర్వహించడం ఆనవాయితీ. ఈ మేరకు ఆదివారం ఆడి మహోత్సవ ప్రత్యేక పూజలు చేసి గ్రామ ప్రజలకు అన్నదానం చేశారు. ట్రస్టు అధ్యక్షుడు.పి.హనుమంతరావు మాట్లాడుతూ దాదాపు అయిదు దశాబ్దాల పాటు తడుకు పేట గ్రామ ప్రజలంతా శ్రీ చలపలమ్మ ఆశీస్సులతో వ్యవసాయం, పాడి పరిశ్రమల్లో అడుగడుగునా అభివృద్ధి చెందామన్నారు. నేడు గ్రామంలోని యువత దేశంలోని పలు ప్రాంతాల్లో ఉద్యోగాలు చేస్తుండడంతో పాటు విదేశాల్లో కూడా ఉద్యోగాలు సంపాదించుకుని స్థిరపడ్డారని, వారంతా కూడా ఏటా ఆడినెల నాలుగో ఆదివారం రోజున గ్రామదేవత అయిన శ్రీ చలపలమ్మను దర్శించుకుని, అన్నదాన కార్యక్రమంలో పాలు పంచుకుంటారని చెప్పారు. కార్యక్రమంలో ట్రస్ట్ ఉపాధ్యక్షుడు రామ్మూర్తి, కార్యదర్శి సురేష్ బాబు, కోశాధికారి సాయి కుమార్, గ్రామప్రజలు పాల్గొన్నారు.

విస్తృతంగా సీసీ రోడ్లు

పాలసముద్రం : మండలంలోని నాలుగు పంచాయతీల్లో వివిధ గ్రాంట్‌ల నుంచి రూ.46 లక్షలతో పాటు జెడ్పీ నిధులతో సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులు పూర్తి చేశామని జెడ్పీటీసీ సభ్యుడు అన్బళగన్ తెలిపారు. ఆదివారం ఆయన శ్రీకావేరిరాజుపురంలో జరుగుతున్న సీసీరోడ్డు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలోని వనదుర్గాపురంలో రూ.12 లక్షలు, ఎస్ఆర్ఆర్ కండ్రిగలో రూ.10 లక్షలు, శ్రీకావేరిరాజుపురంలో రూ.2 లక్షలు, వినాయకపురంలో రూ.2 లక్షలు, పాలసముద్రంలో ఎంపీ గ్రాంట్ రూ.10 లక్షలు, వెంగళరాజుకుప్పంలో రూ.10 లక్షలతో సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులు పూర్తి చేశామన్నారు. ఇంకా రూ.50 లక్షల వరకు అభివృద్ధి పనులు చేయాల్సి ఉందన్నారు. వాటిని త్వరలోనే పూర్తి చేస్తామని తెలిపారు.


శ్రీకావేరిరాజుపురంలో సిమెంట్ రోడ్డు పనులను పరిశీలిస్తున్న జెడ్పీటీసీ అన్బళగన్

ఆనాటి ఆ స్నేహం.. ఆనందగీతం


నాటి గురువులతో పుత్తూరు ఆంధ్రకేసరి స్కూల్ పూర్వ విద్యార్థులు

- నాడు విద్యాబుద్ధులు నేర్పిన గురువులకు పాదపూజ
- సంతోషంగా గడిపిన పూర్వ విద్యార్థులు

పుత్తూరు రూరల్: ఆనాటి ఆ స్నేహగీతం.. నేడు వారిని ఆనందమయంలో ముంచెత్తింది. పాతికేళ్ల క్రితం కలిసి చదువుకున్న నాటి విద్యార్థులు అంతా ఆదివారం అదే పాఠశాలలో కలుసుకుని సందడి చేశారు. స్థానిక గేట్‌పుత్తూరులోని ఆంధ్రకేసరి పాఠశాలలో 1997–98 విద్యా సంవత్సరంలో చదువుకున్న పూర్వ విద్యార్థుల సమ్మేళనం అట్టహాసంగా జరిగింది. వారు తమ చిన్ననాటి సంఘటనలను గుర్తు చేసుకుంటూ, ఒకరినొకరు పలకరించుకున్నారు. ప్రస్తుతం వారి జీవన స్థితిగతులను పంచుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో రిటైర్డ్ హెచ్ఎం వెంకటకృష్ణమనాయుడు మాట్లాడుతూ విలువలతో కూడిన విద్యను అందించడం ద్వారా మంచి సమాజం ఏర్పడుతుందన్నారు. ఎన్నో సమస్యలకు నిశ్శబ్దం, చిరునవ్వు సమాధానం చెబుతాయన్నారు. ఇదే పాఠశాలలో విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులు వెంకటకృష్ణమనాయుడు, బాలసుబ్రమణ్యం, వసంత, గీత, కన్నెమ్మ, జయశ్రీ, విజయలక్ష్మి, వెంకటకృష్ణ, నాగేంద్రకు నాటి విద్యార్థులు పాదపూజ చేసి శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు సురేష్, మునిరాజ, సాయిప్రసాద్, అమీర్‌బాషా, ప్రవీణ్, రాజకుమార్, రాజవేలు, కుమార్, శరవణ, శిల్ప, సుభద్ర, లత, ఈశ్వరి, రజియా, వెంకటేష్, మహేష్, తిరుమల తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం


ధుని, షిర్డిసాయిబాబా విగ్రహం

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో అరిగిలకండ్రిగలోని శ్రీషిరిడి సాయిబాబా ఆలయంలో 25వ వార్షికోత్సవం ముగిసింది. శుక్రవారం నుంచి ఆదివారం వరకు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం రుద్రాభిషేకం, అన్నదానం, లలితా సహస్ర నామార్చన, కుంకమపూజ, రాత్రి శ్రీ గురు చరిత్ర ప్రవచన కార్యక్రమాలు నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.


నవగ్రహకలశాలు

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు



నృత్యం చేస్తున్న కళాకారులు

తిరుచానూరు(చంద్రగిరి): వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా తిరుచానూరు సమీపంలోని శిల్పారామంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. మహారాష్ట్రకు చెందిన అభినయ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రీసెర్చ్ ఫైన్ ఆఫ్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో నాట్య గురువు డాక్టర్ చిత్ర విశ్వనాథన్ పర్యవేక్షణలో కళాకారులు నృత్యప్రదర్శనలు ఇచ్చారు. కళాకారులు కళాశ్రీ, మీనా సంతోష్, స్నేహ అంజన్, ప్రియ సతీష్, రంజని రాఘవన్, వర్ష విశ్వనాథన్‌ను ఏవో ఖాదర్‌వలి సత్కరించి, జ్ఞాపకలు అందజేశారు. ఈ కార్యక్రమంలో రాధాకృష్ణ, పప్పి, వరప్రసాద్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.